గజ్వేల్‌లో బస్సులో నుంచి అభివాదం చేస్తున్న కేసీఆర్

కేసీఆర్‌కు తిలకం దిద్దుతున్న కౌన్సిలర్ రజిత

కేసీఆర్‌కు ఘనస్వాగతం

మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు

గజ్వేల్, మే 8: బస్సు యాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం కేసీఆర్ మెదక్ జిల్లా నర్సాపూర్‌కు గజ్వేల్ మీదుగా వెళ్లారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్ శ్రేణు లు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. బస్సు నుంచే కేసీఆర్ కార్యకర్తలకు అభివాదం చేశారు. మహిళా కౌన్సిలర్లు గుంటుక శిరీషారాజు, బబ్బురి రజిత, బాలమణి, కురాకుల యాదమ్మ వెళ్లి కేసీఆర్‌కు మంగళహారతి ఇచ్చి నూదుట తిలకం దిద్దారు. బస్సు ఎక్కిన ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణశర్మ, మాదాసు శ్రీనివాస్ కేసీఆర్‌ను కలిశారు. అంతకు ముందు ప్రజాపూర్ చౌరస్తాలో కార్యకర్తలు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ఇంటి వద్ద కేసీఆర్‌కు ఆయన కుమారుడు ఎన్సీ సంతోష్ స్వాగతం పలికారు.

పూలమాల వేయించిన కేసీఆర్

ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రం నుంచి నర్సాపూర్ వెళ్తున్న సందర్భంగా గజ్వేల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద వేచి ఉన్న పార్టీ కార్యకర్తలకు అభివాదం చేస్తూ కేసీఆర్ బస్సును ఆపారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎల్లయ్యను బస్సులోకి పిలిపించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయాలని చెప్పారు. ఎల్లయ్య డాక్టర్ బీఆర్ అంబ్కేదర్ విగ్రహానికి పూలమాల వేసే వరకు కేసీఆర్ అక్కడే ఉన్నారు.

సిద్దిపేట జిల్లా రద్దును అడ్డుకుంటా..

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

- జిల్లాకోసం ప్రాణాన్ని పణంగా పెడతా
- ఫేక్ ప్రచారం చేయడంలో బీజేపీ అభ్యర్థి బిట్ట
- బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, మే 8 : సిద్దిపేట జిల్లాను రద్దు చేయడానికి కాంగ్రెస్ సర్కారు యత్నిస్తున్నదని, తన ప్రాణాన్ని పణంగా పెట్టయినా జిల్లా రద్దును అడ్డుకుంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని శివానుభవ మండపంలో సిద్దిపేట రియల్ ఎస్టేట్ వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పాలనను ప్రజలకు చేరువ చేసినట్లు తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు జిల్లాలు రద్దుచేసే కుట్ర చేస్తున్నదని, తద్వారా మరిన్ని సమస్యలు ఉత్పన్నం కాక తప్పదన్నారు. సిద్దిపేట జిల్లా కోసం ఎంత వరకైనా పోరాడుతానని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట అంటే ఎక్కడికి పోయినా గౌరవం ఉండేలా చేశానని, ఆ గౌరవాన్ని మనం కాపాడుకుందామన్నారు. సిద్దిపేటకు వచ్చే నాయకులు మన మీద ప్రేమతో రావడం లేదని, మనలో ఉన్న ఐక్యతను దెబ్బతీసేందుకే వస్తున్నారన్నారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ దుబ్బాకలో ఏమి చేయకపోవడంతోనే అక్కడి ప్రజలు, అసెంబ్లీ ఎన్నికల్లో 54 వేల ఓట్లతో ఆయన్ను ఓడించారన్నారు. వెంకట్రామిరెడ్డి గెలుపు హరీశ్‌రావు గెలుపు అని.. హరీశ్‌రావు గెలుపు కేసీఆర్ గెలుపు అని అన్నారు. సిద్దిపేట అభివృద్ధి కోసం వెంకట్రామిరెడ్డి నిత్యం పని చేస్తాడని హామీ ఇచ్చారు. సిద్దిపేటలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగినా తాను పాల్గొన్నానని, హిందూ ధర్మ పరిరక్షణలో తాను భాగమయ్యానని.. భవిష్యత్‌లో ఉంటానని హామీ ఇచ్చారు. ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట కోసం పని చేస్తానని.. కాంగ్రెస్ పార్టీ మీద కోపంతో బీజేపీకి ఓటు వేస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లవుతుందన్నారు. ఫేక్ ప్రచారం చేయడంలో బీజేపీ అభ్యర్థి బిట్ట అని.. దుబ్బాక ఎన్నికల్లో అలాగే ఫేక్ ప్రచారాలు చేసి లబ్ధి పొందారని.. రేపటి నుంచి ఫేక్ ప్రచారం చేసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనకు పెట్టుబడులు రావడం లేదని, పరిశ్రమలు స్థాపన లేక రియల్ ఎస్టేట్ రంగం నేడు కుదేలైందన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నారని.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నదన్నారు. ఇంకా రైతు బంధు రాలేదని, ఇదేనా మార్పు అని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణకు గాడిద గుడ్డే ఇచ్చాయన్నారు.

గులాబీ జెండా.. తెలంగాణకు అండ

చేర్యాల మండల వీరన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- ఐదు మాసాల్లో కుప్పకూలిన వ్యవసాయ రంగం
- హామీలు అమలు చేయమంటే తిట్ల పురాణమా ?
- అందుబాటులో ఉంటూ.. ఉచిత వైద్యం కొనసాగిస్తా
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేర్యాల మండలంలోని 12 గ్రామాల్లో విస్తృత ప్రచారం

చేర్యాల, మే 8: గులాబీ అధినేత కేసీఆర్ ఎత్తిన గులాబీ జెండా.. తెలంగాణకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఐదు మాసాల్లోనే వ్యవసాయ రంగాన్ని అధోగతి పాలు చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం విజయం కోసం బుధవారం మండలంలోని వీరన్నపేట, ముస్త్యాల, చుంచనకోట, రాంపూర్, కాశేగుడిసెలు, ఆకునూరు, కొత్త దొమ్మాట, గుర్జకుంట, దొమ్మాట, తాడూరు, చిట్యాల, దానంపల్లి గ్రామాల్లో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఖజానాను సర్కారు లూటీ చేసి పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులకు పంపిస్తున్నారని ఆరోపించారు. అధికారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చాడని, ఇప్పుడు వాటిని అమలు చేయలేక చేతులెత్తేశాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరితే సీఎం రేవంత్‌రెడ్డి తిట్ల పురా ణం లేదా దేవుళ్ల పై ఒట్టు పెడుతున్నాడన్నారు. కేసీఆర్ పై అసభ్య పదజాలం ఉపయోగిస్తున్న సీఎం రేవంత్ వెంటనే తన వైఖరి మార్చుకోవాలని, లేని పక్షంలో తమకు కూడా తిట్లు వస్తాయనే విషయాన్ని గమనించాలన్నారు. పొలాలు ఎండగొట్టిన కాంగ్రెస్ సీఎం ఏం మొఖం పెట్టుకుని రైతుల ఓట్లు అడుతున్నాడని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సొంత దవాఖానలో నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నానని, ఇప్పటి వరకు ఆరువేల మందికి వైద్యసేవలు, శస్త్ర చికిత్సలు, మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఎంపీపీ కరుణాకర్, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మల్లేశం, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నేత బాల్‌నర్సయ్య, శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ ఫోరం మండల మాజీ అధ్యక్షులు ఎల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, రైతు బంధుసమితి మండల మాజీ కోఆర్డినేటర్ రంజిత, బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి దాసు, మాజీ సర్పంచ్‌లు రేఖ, భిక్షపతి, దినేశ్, సుభాషిణి, రామ్మోహన్‌రావు, ఎంపీటీసీలు సులోచన, ఖమర్‌సుల్తానాఅతహార్, మహిళా మండల అధ్యక్షురాలు పార్వతి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పర్వతాలు, చందు, చేర్యాల ప్రాంత యూత్ ఇన్‌చార్జి అంజ య్య, మండల అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, కనకయ్య, బాలరాజు, షేక్ కమల్, శ్రీనివాస్, గిరిధర్ పాల్గొన్నారు.

లేగదూడపై హైనా దాడి

మద్దూరు(ధూళిమిట్ట), మే 8: ధూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో లేగదూడపై హైనా దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు జ్ఞానమైన శ్రీనివాస్ వ్యవసాయ బావి వద్ద లేగదూడను కట్టేశాడు. మంగళవారం రాత్రి హైనా లేగదూడపై దాడిచేయడంతో తీవ్రం గా గాయపడింది. ఇటీవల కాలంలో మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వివిధ గ్రామాల్లో హైనాలు సంచరిస్తూ మూగజీవాలపై దాడి చేస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పరిశుభ్రతపై అవగాహన

సిద్దిపేట, మే 8: ప్రపంచ ఆరోగ్య సంస్థ చేతి పరిశుభ్రత దినోత్సవంగా మే5 ను గుర్తించిందని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలా థామస్ అన్నారు. బుధవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల జనరల్ దవాఖాన వద్ద చేతి పరిశుభ్రత ప్రాముఖ్యతపై డాక్టర్ వీవీ శైలజ ఆధ్వర్యంలో నర్సింగ్ సిబ్బంది, ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. దవాఖాన సూపరింటెండెండ్ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెస్‌డెంట్‌గా మల్లేశం

సిద్దిపేట టౌన్, మే 8 : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెస్‌డెంట్‌గా సిద్దిపేటకు చెందిన ఉడుత మల్లేశం యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మల్లేశానికి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు.

అకాల వర్షాలతో రైతన్న ఆగం

సిద్దిపేట టౌన్,మే 8 : అకాల వర్షాలతో రైతన్న ఆగమయ్యాడని, ప్రభుత్వ పట్టించుకోవడం లేదని తెలంగాణ రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గడీల బైరవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం దెబ్బతిన్న పంటలను రైతు సంఘాల నేతలతో కలిసి సిద్దిపేట తదితర ప్రాంతాల్లో ఆయన స్వయంగా పరిశీలించి రైతుల్లో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో మొత్తం పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆయన వెంట రైతు సంఘాల నేతలు రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

గజ్వేల్/బెజ్జంకి/హుస్నాబాద్/దుబ్బాక, మే 8: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బుధవారం గజ్వేల్ పట్టణంతో పాటు బెజ్జంకి మండల కేంద్రం, గుండారం, దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి, చెల్లాపూర్‌లో గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి, సీఐలు సైదా, ముత్యంరాజు, బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగరాజు,హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు తోట మహేశ్, వివేక్, సర్కిల్ పోలీసు సిబ్బంది, సీఏపీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమురవెల్లిలో సామాజిక తనిఖీ

కొమురవెల్లి, మే 8 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీఆర్డీవో బాలకిషన్, ఏపీడీ శివాజీ హాజరై ఆయా గ్రామాల వారీగా తనిఖీ చేశారు. ఎంపీడీవో కుమారస్వామి, విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఎస్ఆర్‌పీ గంగరాజు, అంబుడ్స్‌మెన్ అరీఫ్ సబేరి, ఎంపీవో మంజుల, సీసీ బాలలింగం, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గజ్వేల్, మే 8: గజ్వేల్ పట్టణంలోని రాజిరెడ్డిపల్లి మార్గంలోని ఓ ఇంట్లో కొంత మంది వ్యక్తులు జూదం ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడుల్లో నెంటూర్‌కు చెందిన నిరుడి రాజు, గజ్వేల్‌కు చెందిన మహ్మద్ షాదుల్లా, మహ్మద్ రహీం నుంచి రూ.7 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సైదా తెలిపారు.

పీఎంపీ, ఆర్ఎంపీలకు అండగా బీఆర్ఎస్

సిద్దిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, మే 8: పీఎంపీ, ఆర్ఎంపీలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు. హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలోని శివానుభవ మండపంలో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా పీఎంపీ, ఆర్ఎంపీలు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పదేండ్లు ఆర్ఎంపీ , పీఎంపీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూ సిందన్నారు. కాంగ్రెస్ ఐదు నెలల్లోనే 500 మందిని జైలులో పెట్టిందన్నారు. వెంకట్రామిరెడ్డి విద్యావంతుడని, పార్లమెంట్‌లో ఆయన గళం వినిపించేందుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో పథకాలన్నీ రివర్స్‌లో ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, నాయకులు రవీందర్‌రెడ్డి, లోక లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికల జోరు

పోతారంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక,మే 8: మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు పక్కా అయిందని, కేవలం మెజార్టీ కోసమే ఈ ఎన్నికలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం దుబ్బాక మండలం పోతారంలోని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పోతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, రమేశ్‌రెడ్డి, కొత్త రాజు, ఎల్లారెడ్డితోపాటు రఘోత్తంపల్లికి చెందిన బీజేపీ నాయకుడు భాస్కర్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం పనిచేసేందుకు బీఆర్ఎస్‌లో చేరినట్లు వారు తెలిపారు. నాయకులు కొత్త కిషన్‌రెడ్డి, నారాగౌడ్, బనాల శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.

'వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుంటాం'

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నేతలు

సిద్దిపేట టౌన్, మే 8 : మాదిగల మద్దతు మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికే ఉంటుందని, ఆయన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు బెల్ల రాములు, ముత్యాల కనకయ్య, మెట్ల శంకర్లు అన్నారు. సిద్దిపేట ప్రెస్ కబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాదిగల అభివృద్ధికి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనలేని కృషి చేశారన్నారు. మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి గెలువడం ఖాయమని చెప్పారు. నేతలు శ్రీనివాస్, అశోక్, రాజయ్య, వెంకట్రాజ్యం, కనకరాజ్, రాములు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న విశ్వంహిందూ పరిషత్ నేతలు

సిద్దిపేట టౌన్ మే 8 : సీఎం రేవంత్‌రెడ్డి అయోధ్య రాముడి అక్షింతలను అవమానపర్చడంపై హిందూ సంఘులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీనివాస్, మురళి, ధర్మప్రసాద్, నాగేందర్,అనిల్ పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

అక్కన్నపేట, మే 8: మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ లక్ష్మీబీలూనాయక్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కాంగ్రెస్ సర్కారు గొల్లకుర్మలకు లబ్ధి చేయనప్పుడు వారు కట్టిన డీడీలను తిరిగి వాపస్ చేల్లించాలని అక్కన్నపేట ఎంపీటీసీ పెసరు సాంబరాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. అక్కన్నపేట, కట్కూరు, గండిపల్లి, పంచరాయితండాతోపాటు పలు గ్రామాలకు మిషన్‌భగీరథ నీటి సరఫరా అరకొరగా కొనసాగుతుందని ఎంపీటీసీలు సాంబరాజు, ప్రమీల, సుదేష్ణ, శ్రీనివాస్ పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులు జరుపకపోవడంతో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సాంబరాజు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రామవరానికి చెందిన మల్టీపర్పస్ వర్కర్ కనుకయ్య చనిపోగా బీమా చేయక ఆ కుటుంబం రోడ్డున పడిందని ఎంపీటీసీ శ్రీనివాస్ అన్నారు. జడ్పీటీసీ భూక్యామంగ, ఎంపీడీవో భానోతు జయరామ్, సూపరింటెండెంట్ శంకరయ్య, కట్కూరు పీఏసీఎస్ చైర్మన్ రాజయ్య, ఎంపీటీసీలు,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

చేర్యాల, మే 8 : తెలంగాణ రైతాంగాన్ని రేవంత్ సర్కారు అరిగోస పెడుతున్నదని, భారీ వర్షం కురిసి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఆకునూరులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, భారీ వర్షం వల్ల కలిగిన నష్టం, ఎన్ని రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చారు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.స్పందించిన ఎమ్మెల్యే సంబంధితశాఖ అధికారులతోపాటు పీఏసీఎస్ చైర్మన్ వంగా చంద్రారెడ్డితో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేసి రైతుల సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో కేంద్రాలు తూతూమంత్రంగా ప్రారంభించారని, కొనుగోలు నత్తనడకన సాగుతున్నదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గదరాజు యాదగిరి, దొమ్మాట ఎంపీటీసీ వినోద, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, దుర్గయ్య, మండల ప్రధాన కార్యదర్శి దాసు, మండల ప్రచార కార్యదర్శిలక్ష్మణ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, షేక్ అఖిల్, గిరిధర్ పాల్గొన్నారు.

నష్టపోయిన కర్షకులను ఆదుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 8: వడగండ్లకు పంటలు దెబ్బతిని నష్టపోయిన కర్షకులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో వడగండ్లకు దెబ్బతిన్న వరి పంటలను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. గ్రామ మాజీ సర్పంచ్ బొల్లు కృష్ణవేణీచంద్రమౌళి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చెవిటి మహేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మద్దూరు మండల కేంద్రంతోపాటు మండలంలోని గాగిళ్లాపూర్, ధర్మారం గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వడగండ్లకు దెబ్బతిన్న వరి, మామిడి పంటలను ఏఈవో రాకేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి నష్టపోయిన పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మారం మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు మాజీ జడ్జిని కలిసిన కలెక్టర్

సిద్దిపేట అర్బన్, మే 8 : కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ కమిషన్ కమిషనర్, సుప్రీం కోర్టు మాజీ జడ్జి పినాక చంద్ర ఘోష్‌ను సిద్దిపేట హరిత మినర్వా హోటల్‌లో బుధవారం కలెక్టర్ మను చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. రామగుండం నుంచి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్తున్న క్రమంలో సిద్దిపేట హరిత మినర్వా హోటల్‌లో కలెక్టర్ కలిశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

సిద్దిపేట అర్బన్, మే 8 : పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు నిర్భ యంగా ఓటు వేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. ఈ నెల 13న జరిగే లోక్ సభ ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలు సశస్త్ర సీమా బల్, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్, కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్ ఇన్‌స్పెక్టర్లకు బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్‌లో పటిష్టమైన బందోబస్తు గురించి ఆమె దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఉన్న భౌగోళిక పరిస్థితులు, క్రిటికల్, నార్మల్ పోలింగ్ కేంద్రా లు, రూట్ మొబైల్స్, స్టైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్, స్టాటికల్ బందోబస్తు తదితర అంశాల గురించి తెలియజేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాలు తనిఖీ చేసేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సు భాష్ చంద్రబోస్, ఏసీపీ మధు పాల్గొన్నారు.

న్యాయమూర్తిని కలిసి సీపీ

సిద్దిపేట టౌన్, మే 8 : జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవిని పోలీస్ కమిషనర్ అనురాధ,అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ ట్రయల్ కేసులు తదితర అంశాలపై చర్చించారు.

దుబ్బాకలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి

గజ్వేల్: ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వెంకట్రామిరెడ్డి అన్న కుమారుడు సుప్రీత్

చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాక టౌన్ : దుబ్బాక మున్సిపాలిటీలోని దుంపలపల్లి వార్డుల్లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక

జగదేవ్‌పూర్: చాట్లపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి: కాసులాబాద్‌లో ఉపాధి కూలీల వద్ద ప్రచారం చేస్తున్న మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు

#